క్లుప్తంగా

అనంతపురం వెళ్లి పింఛన్ అందజేత



మహాలక్ష్మితో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ హరిప్రసాద్

కొలిమిగుండ్ల: బెలుం గ్రామానికి చెందిన వలంటీర్ హరిప్రసాద్ సోమవారం అనంతపురం వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. గ్రామానికి చెందిన కానాల మహాలక్ష్మి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో ఆపరేషన్ చేయించుకునేందుకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పది రోజుల నుంచి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆసుపత్రికి వెళ్లి వితంతు పింఛన్ రూ.3వేలు అందజేశారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న శివమాలధారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జునస్వామి ఆలయంలో పుష్య మాసం సోమవారం సందర్భంగా శివమాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు.

సీపీఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి



పోస్టు కార్డులు చూపుతున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: రాబోయే ఎన్నికల్లో సీపీఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చే పార్టీలకు తమ ఓటు అని యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఓటు ఫర్ సీపీఎస్ కార్యక్రమం పేరుతో సోమవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, గోపాల్, సంజీవరెడ్డి, సుమన్, లక్ష్మయ్య, లక్ష్మీకాంతరెడ్డి, సురేష్, లీలావతి, రాధ, అల్లిపీరా, భుకాంతరెడ్డి, మధుసూదనరెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు ఇవ్వండి



మాత్రలను హెచ్‌ఎంలకు అందజేస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: ప్రతి విద్యార్థికి ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామయ్యతో కలిసి ఆయన ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. రెండేళ్ల వయసు నుంచి 19 ఏళ్ల వయస్సులోపు వారికి వీటిని తినిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శివరామయ్య

బనగానపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీ–2024ను ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉండాలన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య, నియోజకవర్గ అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వరు, ఎం.రఘురామిరెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, చంద్రశేఖర్, బాలచెన్నయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో హెచ్.కొట్టాల

● ఆకర్షణీయంగా ప్రభుత్వ భవనాలు ● అన్ని సేవలూ గ్రామంలోనే..

మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనతో సాకారమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని సేవలను గ్రామాల్లోనే అందిస్తూ ప్రతి పల్లెను అభివృద్ధి బాటలో నడిపిస్తోంది. గత టీడీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని హెచ్ కొట్టాల సైతం జగనన్న పాలనలో మౌలిక వసతులతో కొత్త శోభను సంతరించుకుంది. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణాలతో ప్రజలకు అన్ని సేవలను అందిస్తోంది.



గ్రామంలో ఆకర్షణగా ఉన్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం



గ్రామంలో సీసీ రోడ్డు వేయడంతో ఆకర్షణీయంగా ఉన్న వీధులు

హెచ్‌కొట్టాల గ్రామ జనాభా	2006
ఓటర్లు	1,500
నివాస గృహాలు	588

బేతంచెర్ల: మండల కేంద్రానికి 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న హెచ్ కొట్టాల గ్రామం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ.2.35 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో రూ.12 లక్షలతో బీటీ రోడ్డు, రూ. 15 లక్షలతో గ్రావెల్ రోడ్డు, రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధికి రూ.15 లక్షలు, రూ.23 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటు రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.15.74 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మించారు. అదనంగా డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల క్రాస్ రోడ్డు వరకు రూ.8.20 కోట్లతో నాలుగు లేన్ల రహదారి వేశారు. దీనికితోడు గ్రామ సమీపంలో డోన్ రహదారిలో రూ.2 కోట్లతో వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

ఆకర్షణగా సచివాలయాలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలపరిష్కారంలో భాగంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ గ్రామానికి ఆకర్షణగా ఉన్నాయి. వాటి ద్వారా ప్రజలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అన్ని సేవలు అందిస్తున్నారు.

– వెంకటలక్షమ్మ, సర్పంచ్, హెచ్ కొట్టాల

గ్రామ స్థాయిలోనే సేవలు



పాలనలో కొత్త ఆవిష్కరణలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయిలో ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పొలాల రహదారుల కూడా ఏర్పాటు చేశారు.

– దివాకర్, హెచ్ కొట్టాల గ్రామస్తుడు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



బనగానపల్లె: జిల్లా నూతన కలెక్టర్ శ్రీనివాసులను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ సమస్యలతో పాటు పట్టణంలో పేదలకు పంపిణీ కావాల్సిన ఇళ్ల పట్టాల విషయంపై కలెక్టర్ శ్రీనివాసులతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రితంరెడ్డి హెచ్చరించారు. సోమవారం సిమెంట్ నగర్ గ్రామంలో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం ఆవరణంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివ శంకర్ నాయక్, ఏఎస్ఐ బేగ్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలి

● జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల–కూకట్‌పల్లి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. సోమవారం కొలిమిగుండ్ల నుంచి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బస్సు సర్వీసును నంద్యాల ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రజియా సుల్తాన, బనగానపల్లె డీఎం కిషోర్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కొద్ది దూరం వరకు బస్సులో ప్రయాణించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతు 15 ఏళ్ల క్రితం కొలిమిగుండ్ల నుంచి హైదరాబాద్‌కు డీలక్స్ బస్సు సర్వీసు ఉండేదన్నారు. అవుకు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో రోడ్డు సరిగా లేక నిలిపివేశారన్నారు. మండలంలో పలు గ్రామాల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ఆసుపత్రులకు వెళ్లేవారు చాలా మంది ఉన్నారన్నారు. నేరుగా బస్సు సర్వీసు లేక పోవడంతో బనగానపల్లె, కర్నూలు, తాడిపత్రికి వెళ్లి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ సర్వీస్ కొలిమిగుండ్ల నుంచి ప్రతి రోజు రాత్రి 8:15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు తెల్లవారు జామున 5 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగభూషణంరెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పీఆర్టీయూ డైరీ–2024ను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, దానమయ్య, నాగ సుబ్బారెడ్డి, సుధాకర్, సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు సన్మానం



క్రీడాకారులను సన్మానించిన జెడ్పీటీసీ తదితరులు

ప్యాపిలి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్యాపిలి జట్టు సభ్యులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి తదితరులు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్యాపిలి జట్టు జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బషీర్, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కబడ్డీ జట్టు సభ్యులు నరేశ్, అరుణ్, భాస్కర్, రాజేశ్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, రవితేజ, రాజు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కోవెలకుంట్ల సీఐ జయచంద్ర



కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్‌రెడ్డి



రేవనూరు ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి



కొలిమిగుండ్ల తహసీల్దార్ సునితా బాయి

కోవెలకుంట్ల/కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామానుజులును వైఎస్సార్ జిల్లా ఖాజీపేటకు బదిలీ చేశారు. ఆ స్థానంలో చిత్తూరు జిల్లా అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ ఇటీవల సీఐగా పదోన్నతి పొందిన జయచంద్రను నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ కడప జిల్లా తలమంచిపట్నం ఎస్ఐ గోపీనాథరెడ్డి ఇటీవలనే సీఐగా పదోన్నతి పొందారు. ఆయనను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల సీఐగా కేటాయించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ రమేష్‌రెడ్డి సంజామల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. కోవెలకుంట్ల మండలం రేవనూరు ఎస్ఐ కల్పనను వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు బదిలీ చేశారు. ఆ స్థానంలో నంద్యాల తాలూకా ఎస్ఐ రాంమోహన్‌రెడ్డిని నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా..

కొలిమిగుండ్ల మండల తహసీల్దార్‌గా సునితా బాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకోగానే రెవెన్యూ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. అనంతపురం జిల్లా పామిడి తహసీల్దార్‌గా ఉన్న సునితా బాయిని కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా నియమించారు.

ప్యాపిలి తహసీల్దారుగా ప్రతాప్..

ప్యాపిలి: మండల తహసీల్దారుగా ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్‌వర్మను వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రికి బదిలీ చేసిసిన అధికారులు.. గుంతకల్లు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డిని ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

డోన్ రూరల్: మండల పరిధిలోని దేవరబండ గ్రామానికి చెందిన ఈ బ్రహ్మంగౌడ్‌కు సోమవారం సర్పంచ్ డి.పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు మహేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు.

ఘనంగా గరికపాటి రాజారావు జయంతి



గరికపాటి రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: గరికపాటి రాజారావు జయంతిని సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ రచయిత గరికపాటి రాజారావు వైద్యుడిగా, రచయితగా, దర్శకుడిగా సేవలందించారన్నారు. ఎంతో మందిని నటులుగా తీర్చిదిద్దారన్నారు. వివిధ కళా సంస్థలను ఐక్యం చేస్తూ 1943లో పృథ్విరాజ్‌కపూర్, కేఏ. అబ్బాస్, హరి, రవీంద్రనాథ్‌ఛటోపాధ్యాయ తదితరులతో కలిసి కమిటీగా ఏర్పడి అఖిలభారత ప్రజానాట్యమండలిని స్థాపించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, మండల కార్యదర్శి సుబ్బారెడ్డి,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ, శివనాగయ్య, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

● రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



పొదుపు మహిళ గ్రూపులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

డోన్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. స్థానిక షాదిఖానలో సోమవారం ఏర్పాటు చేసిన నాలుగవ విడత పొదుపు మహిళల రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో పొదుపు మహిళల ఇబ్బందులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలను అందజేస్తే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సున్నా వడ్డీకే పొదుపు మహిళలకు రుణాలను అందజేశారన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగనన్న చేశారన్నారు. వైఎస్ఆర్ ఆసరా కింద మండలంలోని పొదుపు మహిళ గ్రూపులకు రూ.4.64 కోట్లు, బేతంచెర్ల మండలానికి రూ.8.31 కోట్లు, ప్యాపిలి మండలానికి రూ.4.87 కోట్లు మంజూరైందన్నారు. మొత్తం నాలుగు విడతలుగా నియోజకవర్గంలోని 3,031 పొదుపు మహిళ గ్రూపుల్లోని 29,932 మంది సభ్యులకు రూ.71.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లక్షలాది కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి పట్టం కట్టాలని మహిళలను కోరారు. అనంతరం పొదుపు మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమావేశంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, సింగిల్‌విండో అధ్యక్షులు తిరునాంపల్లె తిరుమల రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు

డోన్ ఆర్డీఓగా మహేశ్వరరెడ్డి



ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్: డోన్ డివిజనల్ రెవెన్యూ అధికారిగా బి.మహేశ్వరరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వెంకటరెడ్డి సాధారణ ఎన్నికల్లో భాగంగా నగరికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా వీరబల్లి మండల తహసీర్ మహేశ్వరరెడ్డిని పదోన్నతి కల్పించి నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన ఆర్డీఓను డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ సిబ్బంది పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ



శివపార్వతి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొల్లపల్లె హరిముకుంద భార్య గొల్లపల్లె హరిప్రియ శనివారం అర్ధరాత్రి కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి మృతి చెందింది. మృతిరాలికి భర్త, కుమారుడు ఉన్నారు. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి సూచించారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు తదితర 150 మందికి రూ.100 చొప్పున పింఛన్ అందజేశారు. సోమవారం స్థానిక పరంధామ నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సంస్థ సభ్యులు సుబ్బయ్య, పెనుగొండ బాబయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనలో న్యాయం చేయాలి

డోన్ టౌన్: కుల గణనలో తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కురువ సంఘం రాష్ట్ర కోశాధికారి మద్దిలేటి, మండల అధ్యక్షులు ప్రసాద్ కోరారు. సోమవారం ఆర్డీఓ మహేశ్వరరెడ్డిని కురువ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిస్వామి, శివలింగయ్య, సర్పంచ్ లు నాగన్న, జయచంద్ర, బాలమద్ది, శ్రీను, రవి, వెంకన్న, కాశిపతి, మధుశేఖర్ తదితరులు ఉన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

అవుకు: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. రామాపురం గ్రామానికి చెందిన తలారి నాగభూషి, అరదేశి లక్ష్మిదేవి, దస్తగిరమ్మ, సాత్రి బాలనాగమ్మ, కాత్రావత్ జయలక్ష్మిబాయి, చెర్లోపల్లె వడ్డె వెంకట సుబ్బమ్మలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన బోయ రామచంద్రుడు సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి, అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రారంభానికి సిద్ధం



వెంకటాపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



రూ.21.50 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే



రూ.55 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు

బనగానపల్లె రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో రూ.43.60 లక్షలతో సచివాలయం, రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం ఏర్పాటైంది. మరో రూ.55 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ వ్యవసాయ సలహామండలి చైర్మన్ టి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బేతంచెర్ల: మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా కోరారు. సోమవారం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

పింఛన్ అందజేత

సంజామల: ఆకుమల్ల గ్రామానికి చెందిన శేషమ్మ అనారోగ్యంతో డోన్ మండలం చింతలపేటలో కూతురు వద్ద ఉంది. విషయం తెలుసుకున్న వలంటీర్ మౌనిక చింతలపేటకు చేరుకుని శేషమ్మకు వితంతు పింఛన్ అందజేసింది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

శం సువార్త స్వస్థత మహా సభల ప్రారంభం

డోన్ టౌన్: పట్టణంలోని వెంకటనాయునిపల్లె రోడ్డులో కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం ఉజ్జీవం సువార్త స్వస్థత మహా సభలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బెల్లంపల్లి పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ తదితరులు యేసు బోధనలను వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు పాస్టర్ నిత్యానందం, కమిటీ సభ్యులు ఏడీ రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.